# ధర్మ సందేహం

ప్రమాణ పూర్తిగా అంతకన్న ఏమీ జరగలేదు.

"కాస్త పలహారం చేద్దువుగాని లేవరా!" అని వాళ్ళమ్మ అంటూనేవుంది. ఏదో ఆలోచిస్తూ పడుకున్న వాడల్లా చివాలున లేచాడు. కోటు వేసుకున్నాడు. బయట వున్న తన పుస్తకాలూ, కాగితాలూ, కలమూ, రెండు చొక్కాలూ, తువాలూ గబగబా పెట్టెలో అడ్డదిడ్డంగా పడేసి పెట్టెమూసేశాడు. కాళ్ళకు చెప్పులు తగిలించుకున్నాడు పెట్టె చేతపట్టుకున్నాడు. "నే పోతున్నా" అన్నాడు.

ఎక్కడికిరా, అంటే చెప్పలేదు. ఎందుకురా, అంటే చెప్పలేదు.

శివయ్యకు కోపంవచ్చింది. రాదూ? అడ్డంవెళ్ళి, "నీ వేషాలు—నాకెప్పుడూ అర్థం కాలేదనుకో—ఇప్పుడసలే అర్థం కావటంలేదు." అని పలకరించబోయినాడు.

"నాదారికి అడ్డంలేదు!" అన్నాడు జానకిరాముడు.

అంతే. వెళ్ళిపోయినాడు. మళ్ళీ తిరిగిరాలేదు. తిరిగి వచ్చేవాడైతే అట్లా దేనికి వెళతాడూ?

చేతికొచ్చిన కొడుకు. లా చదవకపోతే మానె, ప్రాక్టీసు పెట్టకపోతే మానె, బియ్యే చదివాడుగా? నాలుగు రాళ్ళు తెచ్చుకోగల సమర్థత వున్నవాడేగా?

తనకోసం కాకపోతే మానె-పెళ్ళాం. పెటాకులా? నిక్షేపమల్లే వాడి ఈడువాళ్ళంతా బిడ్డల తండ్రులై కూర్చు న్నారు! తండ్రికోసమైనా ఒక ఉద్యోగమంటూ అఘోరించి పుత్రధర్మంగానైనా, తండ్రిమీది బరువు తగ్గించినవాడు కావచ్చుగా!

తన తండ్రి ప్లీడరు గుమాస్తాగిరీ చేసి కాపరం గడుపు తున్నాడంటే తనకు మాత్రం ఏం ఘనం?

అన్నిటికి ఏదో ఒకటి చెబుతాడు. ఉద్యోగాలెక్కడ ఉన్నయ్యంటాడు. శివయ్య మూడోఫారం పాసుకాలా. ఏడాది వాలంటీరు చేసి అయిదురూపాయలమీద ప్లీడరు గుమాస్తా అయినాడు. జానకిరాముడి పుటకలప్పటిమాట. మరి ఆ చేత్తోనే మున్ఫైవేలు చేసే ఆస్తి సంపాదించాడా? డబ్బు మనదగ్గిరికెప్పుడన్నా వస్తుందా? మనం దానిదగ్గిర కెళ్ళాలిగాని!

అయినా, వాడికి పుత్రధర్మమేమిటి? నాస్తికుడైతే. తద్దినాలేమిటంటాడు. కొలుపు లేమిటంటాడు. పూజలేమి టంటాడు. జాతకాలేమిటంటాడు «ఏ గేశలింగంగారు చచ్చిన ఇన్నేళ్ళకి నాచుట్టూతా ఈ మూఢాచారాలేమిటి" అంటాడు.

దొరికాడు వెధవముండల పెళ్ళిళ్ళపంతులు—ప్రతిదానికి మూఢాచారమే? పనిమీద పోయ్యేవాడు, వొంటిబ్రాహ్మ ణెదురైనాడనో, తుమ్మారనో కూర్చుంటే, అది మూఢా చారమా? పొద్దున్నే లేచింది లగాయతు ఎన్నోపాపాలు చేస్తాం, ఎన్నో అబద్ధా లాడతాం, ఎంతమందినో టోపీ వేస్తాం, రాత్రికి పడుకోబొయ్యే సమయానికి కాస్త 'రామా కృష్ణా' అనుకుంటే, దానమ్మ కడుపుకాలా, అదీ మహా పాతకమేనా? ఇదేనా చదువు సంధ్యలు నేర్పేది?......

## 2

శివయ్యకు నిజంగా పట్టుకున్నది ఇవేవీ కావు. జానకి రాము డిల్లు వొదిలి ఎందుకు పోయినట్టు ?

ఒకపోట్లాట జరగలేదు; వాగ్వాదమన్నా జరగలేదు.

వాడికేవేవో మనస్సులో ఉన్నమాట నిజమే—కాని అవి ఈనాటివి కావుగా ?

అసలు వాడికా ఇంటిమీదే పగ. "కట్టారు ఇల్లు ప్రతి దర్వాజాలో నుంచి వొంగి పోవలసిందే మరో ఉరేసి అంగుళాలు పెట్టుకుంటే ఏంపోయింది ? ఇల్లు మొత్తంమీద ఈ పొట్టి గుమ్మాలు పెట్టి పది రూపాయలన్నా ఆదా చేశారో లేదో, పాపం !" అని సణిగేవాడు.

తను చెమటోడ్చి ఒక్కొక్క రూపాయే కూడబెట్టి పోగుచేసి ఎన్నో ఏళ్ళ ప్రయత్నంతో ముచ్చటపడి కట్టించిన ఈ ఇంటికి, దర్వాజాలు మరో అంగుళం పెట్టలేదని, రోజూ తన కొడుకు సణుగుతూ వుంటే శివయ్యగారి ప్రాణం ఎంత క్షోభ పడాలి. క్షోభ పడలా?... ఏడు ఆరడుగులు పెరుగుతాడని ఆ యిల్లు కట్టిన వారెవరన్నా కలగన్నారా ?...

ఆదేం ఖర్మమో, ఆ తండ్రి కొడుకు లిద్దరికీ ప్రతి దాన్లోనూ ఎడమొహమ్మల్లే. శివయ్యగారు ఎంత సదుద్దేశంతో ఏది చెప్పినా, జానకిరాముడు దానికొక దురుద్దేశం అంటగడతాయె.

"నీ జన్మల్లా ప్లీడరు గుమాస్తా గిరీలో గడిపేరా. ప్లీడరు పని చెయ్యాలనే నీ మోజు నా ద్వారా తప్ప తీర్చుకునేటందుకు లేదు. అందుచేత నన్ను ప్లీడరు కమ్మంటున్నావు......అవును, ప్లీడర్లకి ఏమీ రావటం లేదని నీకు తెలుసు, నీ ప్లీడరుగారు సంపాదించింది నీ తెలివితేటలవలననే అని నీనమ్మకం. నీ తోడుంటే నేను లక్షలు సంపాదిస్తానని నీ ఆశ ! నిజంగా నీ మూలంగానే మీ ప్లీడరుగారు వేలకువేలు సంపాదిస్తే నువ్వాయన దగ్గిర నలభై రూపాయలతో ఎందుకు తృప్తిపడ్డావు ? నీ అసలు సంపాదనంతా క్లయింట్లను దోచి ఎందుకు సంపాదించావు ?"

"ఏమిటీ మాటలు ? మాటా మర్యాదా తెలిసిన తెలిసినవాడు అనేవేనా ?

అసలు వాడికి పెద్దంతరం, చిన్నంతరమంటూ ఉందా"

"రోజూ పాపాలు చేస్తున్నామని తెలుసుండి ఆ పాపాలు చెయ్యకపోతే ఏం ?" అని వాడు తండ్రి నడగలా?

## 3

వాడెందుకు వెళ్ళినట్టు ?"

ఈ ప్రశ్నకి సమాధానం దొరక్కపోవటం శివయ్య గారికి వింతగా ఉంది.

వెడితే వెళ్ళాడు. బలవంతాన ఇంటో ఉంచుతారా ఏమిటి ? పాతికేళ్ళు పైబడ్డవాణ్ణి.

వాడు జంఝం లాగిపారెయ్యటం ఈ ఇంటోనే అయి పోయింది. తనను అనవలసిన మాటలన్నీ అనటం అయిపో యింది. "నీ సంపాదనలో నుంచి నా కొక్క దమ్మిడీ అక్క రేదనటం అయింది. చాలాకాలం కిందటే అప్పుపోసి విడిచే శారు. ఇప్పు డకస్మాత్తుగా ఏమి వచ్చిందని లేచిపోయినట్టు ?

రోజూ భోజనం వేళకు ఇంటికి వస్తాడు ఎక్కడికో వెడతాడు. ఎవరెవరో వచ్చి పిలుచుకు పోతారు. ఏమేమి విషయాలో మాట్లాడతారు. ఇహానికీ, పరానికీ చెందిన విష యాలు కావు. ఒక డబ్బు విషయం కాదు, ఒక కోర్టు వ్యావ హారం కాదు, ఒక కుటుంబ వ్యవహారం కాదు. ఎవరూ

లేకుండా ఇంట్లో కూచుని ఏదో రాస్తాడు బ్రహ్మానాథ. అవంతా పత్రికలకి పంపిస్తాడు గామాలు. చిన్నవా డప్పు డప్పుడూ, "నాన్నా, అన్నయ్య రాసింది అచ్చుపడ్డది చూశావా ? అంటాడు.

ఏముంటుంది చూడటానికి ? బూతిద ! ఫీరేకలింగ మని ఉంటుంది ! జంఝాలు తెంచమని ఉంటుంద ! అన్న మంతా పట్టిమాడాలీ ? అబ్బాయి వాలకం అర్థమవుతూనే ఉందిగా !

ఇదంతా జరిగిపోతూనే వుందిగా? ఇప్పుడు వీడెందుకు ఇల్లువిడిచి దిక్కు లేని పక్షి అయి, వెళ్ళిపోవాలి?...

శివయ్యగారు తనమీద దోషారోపణ చేసుకోవలసిన అవసరం ఏమీ లేదు. కాని కొడుకు లేచిపోవటానికి తప్పు తన దే అని ఎవరో అన్నట్టుగా ఆయన బాధపడ్డాడు. వాడు, "నీమూలంగానే నేను ఈకొంపలోంచి బయటికి పోతున్నా" అంటే ఎంత సిగ్గుపడాలో అంతగా ఆయన మనస్సు గింజు కుంటున్నది.

ఆ కారణం తెలిస్తే బాగుండును. అప్పుడుగాని ఈ గుంజాటన అంతంకాదు. ఆ కారణంకోసం ఆయన మనస్సు ఆనాటి—జానకిరాముడు వెళ్ళిపోయిననాటి—సంఘటనని సినిమాచిత్రం మళ్ళీ మళ్ళీ వేసి చూసుకున్నట్టు చూసుకుం టున్నది.

వెనక ఒకసారి—పదేళ్ళ క్రితం—చిన్న సంఘటన జరిగింది. శివయ్యగారు బజార్లో అయిదురూపాయల కాగితం పారేసుకున్నాడు. అది పోయిందని చూసుకున్న చోట

గొడ్డు ఝాముసేపు వెతికాడు. కాగితం దొరకలేదు. ఆయనే కాదు. ఇంకా యాభైమంది కలిసి వెతికారు.

"ఇంకెక్కడన్నా పారేసుకున్నారేమో?" అని ప్రతి వెధవా అనేవాడు. చివరి కాయనకి కోపంకూడా వచ్చింది.

"ఇంతవరకూ చేతిలోనే వుంది. ఇప్పుడే పోయింది. ఇక్కడే చూసుకున్నా" అంటున్నాడాయన.

కాగితం పోయిందని రూఢి అయినాక ఆయనకు, వట్టి పుణ్యానికి ఐదురూపాయలు పోయాయన్న విచారంకన్న తన పెద్దకొడుకు—అంటే ఈ జానకిరాముడే—ఆ పొద్దునే తనను ఐదురూపాయలడిగి లేదంటే లేదనిపించినందులకు కోపం ఎత్తుకొచ్చింది. ఆ వెధవ తనచేత అన్నిసార్లు ఐదు రూపాయలు లేదనిపించకపోతే ఈ కాగితం ముక్క పోకపోను... వెధవ తథాస్తు దేవతలు!...

అట్లాగే ఇప్పుడు...

ఈ విషయం ఎందుకు చెప్పొచ్చానో మరిచాను. పోనివ్వండి...

# 4

రెండోవాడున్నాడే ... సూర్యం — వీడు వాడి మాదిరే కాడు. అసలు మొదటినుంచీ వీడితరహాయే వేరు. వీడిదగ్గిర దాపరికం లేదు. స్పష్టంగా మనసులో వున్నది చెప్పేస్తాడు.

“ఇదుగో, నాన్నా! నువ్వు నన్ను లా చదవమంటున్నావు. నువ్వు చెప్పినట్టు వినడం నా ధర్మం. నేను చదువుతాను. నాకేమీ అభ్యంతరం లేదు. నీ ముచ్చట తీర్చటం కంటే నాకు కావలసిందేమిటి? కాని నేను ప్రాక్టీసు చేసి పైకొచ్చి ఫలానావాడి పిల్లవాణ్ణి అనిపించుకోగలనని నాకు నమ్మకం లేదు. నువ్వు ప్లీడరు గుమాస్తా చేశావంటే మీ ప్లీడరుగారికున్నంత పేరు నీకూ వుంది. ఆయన సంపాదించినంతా నువ్వూ సంపాదించావు. రేపు నలుగురూ నన్ను చూసి ఫలానా శివయ్యగారి కుర్రాడేనా ఈ ప్రాక్టీసులేని ప్లీడరు, అంటే నీ మనస్సెట్లా వుంటుందో ఆలోచించు. ప్లీడరీ చెయ్యటానికి కాస్త ఆరితేరినవాడై ఉండాలని నీకు తెలుసు కదా! నన్ను నలుగురిచేతా బుద్ధిమంతుడు, అమాయకుడనిపించుకునేటట్టు పెంచావు. లాయరు పేచీలు నావల్ల కావు. ఆలోచించు. నువ్వు చదవమంటే లా చదివేస్తాను. ఫస్టు క్లాసులో కూడా పాసయిపోతాను. బియ్యే పాసయినవాడికి లా ఒక లెఖ్ఖా?” అని స్పష్టంగా చెప్పేశాడు.

నిజానికి వాడు చెప్పిందాన్లో అబద్ధం యేమీ లేదు. పెళ్ళివిషయంలో కూడా వాడు అట్లాగే చెప్పేశాడు.

"ఇదుగో, నాన్నా! నాకు పెళ్ళిచెయ్యాలను టే మహారాజుగా చేసెయ్యి. కాని, ఇప్పుడు పెళ్ళిళ్ళు వెనకటి లాగా లేవు. ఈ శారదా బిల్లొచ్చినాక పెద్దపిల్లలై పెళ్ళాడుతున్నారే, వీళ్ళు మొగుళ్ళ చూసుకొని ఇష్టపడటమూను, పడకపోవటమూ నేర్చుకుంటున్నారు. ఒకవేళ పెద్దవాళ్ళకి ఎదురాడక వాళ్ళు అంటగట్టిన మొగుణ్ణి చేసుకుంటున్నా లోపల, వీణ్ణినాకు అంటగట్టారే, అన్న పగ పెట్టుకుంటున్నారు. ఇటువంటి పెళ్ళిళ్ళు లేకుండానే వుండాలిగాని ఉన్నాక మొగుడు పెళ్ళాళ్ళు ఒకరి మనస్సులొకళ్లు తెలుసుకుని చేసుకోవటమే మంచిది. ఏమీ ఎరగనప్పుడు చేసేసిన మీ కాలపు పెళ్ళిళ్లే మేలు. అవిపోయాక ఎవళ్ళకివాళ్లు చూసుకునే సంబంధాలు నయంగాని ఈ మధ్యరకపు పెళ్ళిళ్ళు అందునా ఇందునా కాకుండా అఘోరిస్తాయి. నేచెప్పింది అవునంటావా, కాదంటావా!"

అందులో అబద్ధమేముందీ?

"ఎక్కడ చూసినా బియ్యేలే నాన్నా. రూపాయికి, పదిమంది దొరుక్కుతున్నారు. ఏం ఉద్యోగం పోసస్తూ ? ఉద్యోగం లేకపోతే మనకేం జరగదు గనకనా? నాక్కూడా అన్నయ్యలాగే కథలు రాద్దామని ఉంది,నవలలు రాద్దామని ఉంది, నాటకాలు రాస్తాను కూడాను. రెండు కథలు రాసి పత్రికలకు పంపా. పడతాయి. నువ్వే చూద్దువు గానిగా ? నే చెప్పేదీ, చాతనయిన పని చెయ్యటంలోనే

నిజమైన కీర్తి వుంది. ఎందరు ప్లీడరు గుమాస్తా పని చేయలేదు. ఏదీ ? నీకొచ్చిన పేరందరికీ రాలేదేం ?" అన్నాడు సూర్యం.

## 5

నేనొకసారి చుట్టపుచూపుగా శివయ్యగారింటికి వెళ్ళారు

కుశల ప్రశ్నలయినాక మాటల సందర్భంలో ఆయనతో, "ఏం, బావగారూ ? పిల్లలిద్దర్నీ సాహిత్యంలో దిం చారే ?" అన్నా.

"హాళ్ళ మొహం !....నిన్ను చూసే చెడిపోయి ఉం టారు...సరేకాని మా సూర్యం ఏమన్నా బాగా రాస్తాడా" అన్నాడాయన

"బాగానే రాస్తే. ధోరణి ఉంది. కాని పెద్దవాడికి చాలదేమో. ఎక్కువ మందిని ఆకర్షించేవి చిన్నవాడి కథలే గాని మీ జానకిరాముడి రాతలో లోతు జాస్తి అనిపించింది నాకు" అన్నాను.

"నే నివేవీ చదవనులే ... అయినా నన్నడిగితే ఏ పనిలో కూడా, చూస్తున్నాగా, పెద్దవాడికన్న సూర్యానికే చాకచక్యం జాస్తి," అన్నాడు శివయ్యగారు.

అందామా వద్దా అని కాసేపు పస్తాయించి ఆఖరుకు అనేశా!

“చూడండి, బావగారూ. మీరు చదవరు కనుక తెలీదుగాని, మీ పిల్లలిద్దరూ మిమ్మల్ని కథలోకి ఎక్కించేశారు.”

“నన్నే? నన్నే?” అన్నారు శివయ్యగారు కంగారుగా.

“అవును. అదిగాదు నే చెప్పవచ్చింది. మీ సూర్యం మిమ్మల్ని చాలా అపహాస్యం పాలుచేసి కథ రాశాడు. మీ పెద్దవాడి కథలో —”

నా మాట శివయ్య పూర్తికానివ్వలేదు.

“వాడెందుకు ఇల్లు వొదిలి వెళ్ళిపోయినాడో నా కర్థం కాలేదు. ఎంతో ఆలోచించా. ఇంట్లో వుంటే వాడికేమి నష్టం వచ్చింది?”

“ఉంటే వాడు కూడా మీ సూర్యం రాసినట్టే రాసేవాడేమో!” అన్నా. నా కింకేమీ అనటానికి తోచలా, చెప్పొద్దూ.

శివయ్యగారు అర్థంకాని చూపులతో నాకేసి అట్లాగే చూశాడు.